క్లుప్తంగా

టెక్నాలజీని ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న సాయికిరణ్

లక్సెట్టిపేట: విద్యార్థులు టెక్నాలజీ, ఏఐ, చాట్‌జీపీటీని చదువుకోసం ఉపయోగించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వింటూ ఇతర అంశాలపై టెక్నాలజీ ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. సెల్‌ఫోన్ వాడకం వల్ల కలిగే లాభనష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు సత్తన్న, ఏజీపీ సత్యం, ఉపాధ్యక్షుడు నళినికాంత్, కార్యదర్శి ప్రదీప్, ట్రెజరర్ సుమన్‌చక్రవర్తి, సీనియర్ న్యాయవాదులు సురేందర్, అక్కల శ్రీధర్, కిరణ్‌కుమార్, శివశంకర్, ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

జన్నారం బంద్ విజయవంతం



సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తున్న భూమాచారి

జన్నారం: జన్నారం గుండా భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన జన్నారం బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచి కిరాణా, హోటళ్లు, పాన్ షాప్‌లు, హేయిర్‌కటింగ్ దుకాణాలు, సినిమాహాళ్లు, విద్యాసంస్థలు బంద్ చేశారు. ఒకరోజు ముందుగా ఇచ్చిన సమాచారంతో స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. జన్నారం వచ్చిన కలెక్టర్ కుమార్ దీపక్ దీక్ష శిబిరం వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. భారీ వాహనాల నిషేధంతో మండలానికి జరుగుతున్న నష్టం, మండల వాసులు పడుతున్న ఇబ్బందులను భూమాచారి, బద్రినాయక్‌లు కలెక్టర్‌కు విన్నవించారు.

ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి

నస్పూర్: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. శుక్రవారం ఆయన నస్పూర్‌లోని కేజీబీవీని సందర్శించారు. విద్యాలయం పరిసరాలను, వంట గదిని, తరగతులను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. స్పెషల్ ఆఫీసర్ మౌనిక ఉన్నారు.

పశు వైద్యశాలలు తనిఖీ



నీల్వాయిలో రికార్డులు పరిశీలిస్తున్న శంకర్

కోటపల్లి/వేమనపల్లి: వర్షాకాలంలో పశువులకు సక్రమించే వ్యాధులపట్ల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి శంకర్ పేర్కొన్నారు. కోటపల్లి, నీల్వాయి, వేమనపల్లి పశువైద్యశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, రైతులకు అందుబాటులో లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేమనపల్లి పశువైద్యాధికారి సుప్రియ, పవన్‌కుమార్ ఉన్నారు.

ప్రాణహితకు వరద ఉధృతి

వేమనపల్లి: ప్రాణహితకు మళ్లీ వరద ఉధృతి పోటెత్తింది. మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండటంతో గంట గంటకు వరద ఉధృతి పెరుగుతోంది. మహారాష్ట్ర–తెలంగాణకు రాకపోకలు సాగించే నాటుపడవలు నిలిచిపోయాయి. వరద ప్రవాహం ఎక్కువైతే రెండోసారి పంటలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. రావర్ల బొందచేను ఒర్రె, వేమనపల్లి పుష్కర ఘాట్, సుంపుటం ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు వరద నీరు చేరుతోంది.

డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

దండేపల్లి: గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని ఎస్సై తహ సీనోద్దీన్ శుక్రవారం ప్రారంభించారు. బడిబాగులో నేను అనే కార్యక్రమంతో దాతల సాయంతో హెచ్‌ఎం బుచ్చన్న పాఠశాలలో మౌలిక వసతులు సమకూర్చడం అభినందనీయమని ఎస్సై తెలిపారు. అనంతరం దాతలు గుండా మల్లేశ్వరి దంపతులు, నల్మాస్ మల్లికార్జున్, అతని మిత్ర బృందాన్ని సన్మానించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇరుకురోడ్డుతో అవస్థలు

- చెరువు కట్టే ప్రధాన రహదారి
- వెడల్పు చేయకుండా బీటీ రోడ్డు నిర్మాణం
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



పోలంపల్లికి వెళ్లేందుకు చెరువు కట్టపై నిర్మించిన ఇరుకు రోడ్డు

భీమారం: మండలంలోని పోలంపల్లి వెళ్లేందుకు చెరువు కట్టపై నిర్మించిన బీటీ ప్రధాన రహదారి ఇరుకుగా మారింది. పదేళ్ల క్రితం మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారి నుంచి పోలంపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మించారు. చెరువు కట్టపై రోడ్డు వెడల్పు చేయకుండా బీటీ నిర్మించడంతో రాకపోకలు సాగించే ప్రజలు, ద్విచక్రవాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దాదాపు అర కిలోమీటర్ దూరం వరకు నిర్మించిన రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. కట్టపై రోడ్డు చిన్నదిగా ఉండటంతో ఒక కారు వెళ్తే మరో కారు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అయితే కట్టపై నిర్మించిన బీటీ రోడ్డు చాలాచోట్ల ధ్వంసమైంది. బీటలు బారిన చోట గమనించక ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. రోడ్డు వెడల్పు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. పోలంపల్లికి రోడ్డు నిర్మించే సమయంలో చెరువు కట్ట అడ్డంకిగా ఉంది. దీంతో చెరువు కట్ట మరింత వెడల్పు చేసి రోడ్డు నిర్మించాలని కోరినా అధికారులు పెడచెవిన పెట్టారు. చెన్నూరు ఎమ్మెల్యేగా గెలుపొంది కార్మిక శాఖ మంత్రిగా ఉన్న వివేక్ వెంకటస్వామి ఇప్పటికైనా చొరవ చూపాలని కోరుతున్నారు.

పోలంపల్లి బాట లేకుండే

భీమారం గ్రామానికి ముందే ఏర్పడ్డ పోలంపల్లికి రోడ్డు కోసం బాట ఏర్పాటు చేయడంలో పూర్వీకులు నిర్లక్ష్యం చూపారు. 20 ఏళ్లవరకు గ్రామానికి వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఓ వ్యక్తి చెందిన మామిడితోట మీదుగా చెరువు కట్టకు చేరుకునేవారు. అయితే పంటపొలాల రైతులు, గ్రామస్తులు కలిసి ప్రైవేట్ భూములను కొనుగోలు చేసి మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం కంకర వేసి బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసింది.

ఇబ్బందిగా ఉంది



తాళ్లగూడెం నుంచి పోలంపల్లికి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. జాతీయ రహదారి నుంచి పోలంపల్లి వరకు చెరువు కట్టతో సహా మొత్తం రోడ్డు వెడల్పు చేయాలి. అధికారులు పట్టించుకుని చర్యలు చేపట్టాలి. – జాడి రాములు, తాళ్లగూడెం, పోలంపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి..



పోలంపల్లి వెళ్లే దారిలో చెరువు కట్టపై నిర్మించిన బీటీ రోడ్డు వెడల్పుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. మరమ్మతు పనులు వివరిస్తాం.
– మధుసూదన్, ఎంపీడీవో, భీమారం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- దరఖాస్తులను పరిష్కరించేలా చర్యలు
- రేషన్‌కార్డు మంజూరు నిరంతరం ప్రక్రియ
- సాక్షి ఇంటర్వ్యూలో తహసీల్దార్ కృష్ణ



బెల్లంపల్లి: ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నామని తహసీల్దార్ ఎల్.కృష్ణ తెలిపారు. శుక్రవారం ‘సాక్షి’తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. రోజువారీగా వస్తున్న దరఖాస్తులను ఏమాత్రం జాప్యం చేయకుండా సత్వరంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు.

ప్రశ్న: కుల, నివాస, ధ్రువపత్రాల జారీలో జాప్యం జరుగుతోందనే విమర్శలపై మరేమంటారు?

తహసీల్దార్: దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ అప్రూవల్ ఇస్తున్నాం. ఫార్మాట్ ప్రకారం లేకుండా వస్తున్న దరఖాస్తులను నిశితంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటున్నాం. అవసరమైతే సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపించి ధ్రువీకరించుకుని తగిన నిర్ణయం తీసుకుంటున్నాం. అన్ని సరిగ్గా ఉన్న దరఖాస్తులను రెగ్యులర్‌గా క్లియర్ చేస్తున్నాం.

ప్రశ్న: కొత్త రేషన్ కార్డులు ఎప్పుడు పంపిణీ చేస్తారు?

తహసీల్దార్: తహసీల్దార్ కార్యాలయానికి కొత్త రేషన్ కార్డులు వచ్చాయి. ఎమ్మెల్యే వినోద్‌తో కార్డుల పంపిణీ చేపట్టనున్నాం. ఈ ప్రక్రియ కొన్ని వ్యవధిలో ప్రారంభమవుతుంది.

ప్రశ్న: రేషన్‌కార్డుల మంజూరు, తప్పొప్పుల సవరణకు తుది గడువు ఉందా?

తహసీల్దార్: అలాంటిది ఏమి లేదు. అది నిరంతర ప్రక్రియ. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావొద్దు.

ప్రశ్న: భూ భారతి సదస్సుల్లో ఇచ్చిన దరఖాస్తుల సంగతేమిటి?

తహసీల్దార్: ఆ దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. అంశాల వారీగా క్రోడీకరించే ప్రక్రియ కొనసాగుతోంది. సాదాబైనామా ఇతర భూసమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ ఆదేశాల మేరకు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నాం. ఈ విషయంలో దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

అభివృద్ధి కోసం ఎమ్మెల్యేతో చర్చలు



వినోద్‌తో చర్చిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కాంగ్రెస్ ముఖ్య నాయకులు చర్చించారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని వినోద్ స్వగృహంలో సమావేశమై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టి బెల్లంపల్లిని అభివృద్ధి చేయాలని నాయకులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. త్వరలో కార్యాచరణ చేపట్టాలని సూచనప్రాయంగా నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎం.మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ కారుకూరి రాంచందర్, టీపీసీసీ ప్రచార కార్యదర్శి నాతరి స్వామి, కాసిపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రదీప్, ఓబీసీ సెల్ కోచైర్మన్ బండి లక్ష్మణ్ పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్



నందులపల్లిలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌గౌడ్

నెన్నెల/కోటపల్లి/మందమర్రిరూరల్/చెన్నూర్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపుతో మండల అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో నెన్నెల మండలం నందులపల్లి గ్రామంలో శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికల వర్క్‌షాపులో పాల్గొని మాట్లాడారు. ప్రతీ వార్డుస్థాయి, గ్రామ ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థాయిలో అనుసరించాల్సిన విధానంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం బీఆర్ఎస్ వార్డు సభ్యులు గోపాల్, పర్వతాలు బీజేపీలో చేరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏమాజీ, అసెంబ్లీ కన్వీనర్ సంతోష్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, పార్టీ మాజీ మండల అధ్యక్షులు శైలేందర్‌సింగ్ పాల్గొన్నారు. అదేవిధంగా మందమర్రి మండలం చిర్రకుంటలో మండల, బూత్ కమిటీల అధ్యక్షుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడారు. ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేలా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. కోటపల్లి మండలం సిర్సా గ్రామంలో జరిగిన వర్క్‌షాప్‌లో జాతీయ కార్యవర్గ సభ్యుడు పెద్దపల్లి పురుషోత్తం, చెన్నూర్ మండలం కిష్టంపేటలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాజశేఖర్‌గౌడ్, లక్ష్మణ్‌రెడ్డి స్వప్న, రమేశ్, రామయ్య, లక్ష్మణ్, సంపత్, రాజేశ్, దీక్షితులు, సంజీవరావు, రవికుమార్, రాజయ్య పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



హాజీపూర్‌లో యూరియా నిల్వలు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు తహశీల్దార్, ఎస్సై, ఏవో

బెల్లంపల్లి/నెన్నెల/భీమారం/తాండూర్/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల కేంద్రాల్లో ఎరువులు, పురుగుల మందు దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ, రెవెన్యూ శాఖలు, పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీ చేశారు. నెన్నెలలో టాస్క్‌ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో రిజిస్టర్, బిల్‌బుక్‌లు, పాస్‌మిషన్లను పరిశీలించారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు అమ్మితే కేసులు నమోదుతోపాటు షాపులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, తహసీల్దార్ జ్యోతి, ఎస్సై ప్రసాద్, ఏవో సృజన, ఏఈవో రాంచందర్ ఉన్నారు.

- ఎరువుల డీలర్లు కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీ కన్న అధిక ధరకు విక్రయించినా లైసెన్స్ రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రు నాయక్ హెచ్చరించారు. బెల్లంపల్లిలోని ఎరువులు, గోదాంలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు. జిల్లాకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళనకు గురికావద్దని తెలిపారు. ఏడీఏ రాజానరేందర్, ఏవో ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.
- భీమారంలోని ఫర్టిలైజర్ షాపుల్లో టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. ఏవో సుధాకర్, తహసీల్దార్ సదానందం, ఎస్సై శ్వేత ఉన్నారు.
- తాండూర్ మండలంలోని హనుమాన్ ఫర్టిలైజర్, అగ్రోస్ రైతు సేవ కేంద్రం గోదాంలను తహసీల్దార్ జ్యోత్స్న, ఏవో సుష్మ తనిఖీ చేశారు. ఎస్సై సౌజన్య, ఏఈఓ వెంకటేశ్ ఉన్నారు.
- లక్సెట్టిపేటలోని ఫెర్టిలైజర్ షాపుల్లో రికార్డులు, గోదాంలను తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎస్సై సురేష్ పరిశీలించారు. ఏవో శ్రీకాంత్ ఉన్నారు.
- హాజీపూర్ మండల పరిధిలోని ఎరువులు, యూరియా దుకాణాల తనిఖీల్లో తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎస్సై స్వరూప్‌రాజ్, ఏవో కృష్ణ పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను కలిసిన ఏఐటీయూసీ నేతలు

నస్పూర్: సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఐఆర్‌టీసీ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జాదవ్ వెంకన్నని గుర్తింపు సంఘం(ఏఐటీయూసీ) నాయకులు హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, వైవీ రావు, సమ్మయ్య, ఎల్లయ్య ఉన్నారు.

ఆలయాల్లో పూజలు

మంచిర్యాలఅర్బన్: శ్రావణమాస ప్రారంభంతో శుక్రవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాకేంద్రంలోని విశ్వనాథ ఆలయంలో శివునికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ఈవో ముక్తా రవి, అర్చకులు నరహరిశర్మ, బాలక్రిష్ణ ఉన్నారు.

రక్షణ చర్యలతోనే క్షయ నివారణ

బెల్లంపల్లిరూరల్: ముందస్తు రక్షణ చర్యలు పాటించడంతోనే క్షయ నివారించవచ్చునని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి సుధాకర్ నాయక్ అన్నారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని బుధాకలాన్ గ్రామంలో శుక్రవారం ఇంటిగ్రేటెడ్ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామీణులకు బీపీ, షుగర్, హెచ్‌ఐవీ, హెపటైటిస్, క్షయ, రక్తపరీక్షతోపాటు ఇతర వైద్య పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరపి లేకుండా దగ్గు వస్తే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తెమడ ద్వారా క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామీణులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తాళ్లగురిజాల పీహెచ్‌సీ వైద్యులు ఎవంజలీన్, జుబేయర్, ఎన్‌హెచ్‌సీపీ జిల్లా ఇన్‌చార్జి మధుబాబు, టీబీ సూపర్‌వైజర్ శశికాంత్ పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

- ‘సాక్షి’ ఫోన్ ఇన్‌కు స్పందన



చెత్త తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

బెల్లంపల్లి: ‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో వచ్చిన వినతులకు బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ స్పందించారు. బస్తీవాసులకు ఇచ్చిన హామీ ప్రకారం శుక్రవారం మున్సిపాలిటీ పరిధి 18 వార్డు కాంట్రాక్టర్ బస్తీలో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య సిబ్బందితో తొలగింపజేసి పరిసరాలు శుభ్రం చేయించారు. పారిశుద్ధ్య సమస్యలను నేరుగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా తోడ్పడిన ‘సాక్షి’కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి

నెన్నెల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలను పటిష్టంగా అమలు చేసి నాలుగు కోడ్‌లు రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీల హక్కులు కాలరాయడానికి, జీవనోపాధిని దెబ్బతీయడానికి జీవో 49 తెచ్చిందని ఆరోపించారు. ఆదివాసీ సంఘాలు ధర్నా చేస్తే 49 జీవోను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని ప్రకటించి ప్రభుత్వం మభ్య పెడుతుందన్నారు. దళిత, గిరిజన ఆదివాసీ చట్టాలు 2006 అటవీహక్కు చట్టాలు పూర్తిగా అమలు చేసి పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. రైతులను యూరియా, డీఏపీ సరఫరా చేయాలన్నారు. చిన్నయ్య, రాజయ్య, నానాగౌడ్, ఎర్రనారాయణ, శంకర్, సరస్వతి, మల్లయ్య పాల్గొన్నారు.

జీవో 49 రద్దు చేయాలి



మాట్లాడుతున్న సంకె రవి

పాతమంచిర్యాల: జీవో 49పై కాంగ్రెస్, బీజేపీలు నాటకాలు ఆడుతున్నాయని ఆ జీవోను వెంటనే రద్దుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ మెప్పు కోసం రాష్ట్రప్రభుత్వం ఆదివాసీలను 339 గ్రామాల నుంచి వెళ్లగొట్టడానికి 3 లక్షల ఎకరాల భూమిని ఖాళీ చేయించడం కోసం జీవో 49 తీసుకువచ్చిందన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివాసీల తిరుగుబాటుతో జీవో తాత్కాలికంగా నిలిపివేసి అభయన్స్‌లో పెట్టి రద్దు చేసినట్లు చెబుతుందన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చందు, జిల్లా కమిటీ సభ్యులు ఉమారాణి, సరిత, రమాదేవి పాల్గొన్నారు.

కోటపల్లి: ఆదివాసీలపై రాష్ట్ర ప్రభుత్వానికి గౌరవం ఉంటే వెంటనే జీవో 49ని రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం అన్నారు. రొయ్యలపల్లి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా జీవో 49ని నిలిపివేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది కానీ ఆదివాసీలపై ప్రేమతో కాదనే విషయాన్ని ఆదివాసీ సంఘాలు గుర్తించాలన్నారు. మహేశ్, చిన్నన్న, భీమేష్, పున్నం, భీమన్న, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

జన్నారం: విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి జనార్దన్ అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో గురువారం రాత్రి 9 గంటలకు స్థానిక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి నిద్రించారు. శుక్రవారం ఉదయం విద్యార్థులకు అందిస్తున్న రాగి జావ, టిఫిన్, భోజనం, వసతులను పరిశీలించారు. పాఠశాల అసెంబ్లీలో పాల్గొని విద్యార్థులకు సందేశమిచ్చారు. మధ్యాహ్న భోజనం వరకు పాఠశాలలోనే ఉన్నారు. వసతి గృహంలోని డార్మెటరీ బ్లాక్‌లో లైటింగ్ ఆరెంజ్ చేయాలని వసతి గృహ సంక్షేమధికారిని ఆదేశించారు. అక్కడ అన్ని రికార్డులను పరిశీలించారు. తర్వాత పాఠశాలలో జరిగిన వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, పాఠశాల హెచ్‌ఎం శివరాజం, మండల అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్, పంచాయతీ సెక్రటరీ, అటవీ అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నస్పూర్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ అన్నారు. డ్రైడే ఫ్రైడేలో భాగంగా ఆయన పట్టణంలోని నస్పూర్ గేట్ వద్ద పలు ఇళ్లలోని పరిసరాలను పరిశీలించారు. జిల్లా ఉపవైద్యాధికారి అనిత, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎంజేపీలో అధికారుల తనిఖీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలలో శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ ఆదేశాలతో అసంక్రమణ వ్యాధుల ప్రోగ్రాం అధికారి అప్పాల ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. పాఠశాలలోని వంట గదిని సందర్శించి సామగ్రిని, కూరగాయలు, కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించారు. అదేవిధంగా నంనూర్, గుడిపేటలో చేపడుతున్న అసంక్రమణ వ్యాధుల నిర్ధారణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఏటీసీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ సహకారంతో ప్రభుత్వ ఐటీఐ మంచిర్యాలలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లో నూతన కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. 172 సీట్లు ఉన్నాయని, దరఖాస్తులకు ఈనెల 31 తుదిగడువు ఉందని పేర్కొన్నారు. వివరాలకు మంచిర్యాల ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డుకు మరమ్మతు

కోటపల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు నక్కలపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టు వద్ద పూర్తిగా కుంగిపోయి ప్రయాణాలకు ఇబ్బందిగా మారింది. ఇటీవల గేదె పడి మృతిచెందింది. విషయం తెలుసుకున్న సీఐ బన్సీలాల్, ఎస్సై రాజేందర్ శుక్రవారం గ్రామస్తుల సహకారంతో దెబ్బతిన్న కల్వర్టు రోడ్డుకు మరమ్మతు చేయించి పునరుద్ధరించారు. రోడ్డు బాగు చేయించి ప్రయాణ కష్టాలను తీర్చిన సీఐ, ఎస్సైలను గ్రామస్తులు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి టూటౌన్ ఎస్సైగా సీహెచ్.కిరణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న కె.మహేందర్ బదిలీ కాగా అతని స్థానంలో మంచిర్యాలలో పని చేస్తున్న కిరణ్‌కుమార్‌ను ఇక్కడ బదిలీపై వచ్చారు. బాధ్యతలు అనంతరం పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణ ప్రథమ లక్ష్యంగా పనిచేస్తానని టూటౌన్ ఎస్సై తెలిపారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

జైపూర్: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. మండలంలోని గంగిపల్లి, షెట్‌పల్లి, బెజ్జాల, వేలాల గ్రామాల్లో శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వ్యాధుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎంపీవో శ్రీపతిబాపురావు, హెల్త్‌సబ్ సెంటర్ డాక్టర్ వేదశ్రీ, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, ప్రతిభ, రమమాదేవి, రాకేశ్ ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రిరూరల్: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈ ప్రభాకర్ పేర్కొన్నారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా సండ్రోన్‌పల్లి గ్రామాన్ని శుక్రవారం సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.


భీమిని పోలీస్‌స్టేషన్ సందర్శన

భీమిని: భారీ వర్షాల నేపథ్యంలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తాండూర్ సీఐ దేవయ్య అన్నారు. శుక్రవారం భీమిని పోలీస్‌స్టేషన్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలను ఎస్సై విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. చిన్నతిమ్మాపూర్ పరిధిలో ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున అటుగా ప్రజలు వెళ్లకుండా చూడాలని ఎస్సైకి సూచించారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

దండేపల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ అన్నారు. దండేపల్లి కేజీబీవీలో పీహెచ్‌సీ వైద్యుడు వంశీకృష్ణ, సీహెచ్‌వో రాజారెడ్డి, సబ్‌యూనిట్ అధికారి నాందేవ్‌తో కలిసి శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దోమల ద్వారా డెంగీ, మలేరియా, మెదడువాపు, బోధకాలు, చికెన్‌గున్యా వంటివి వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. దీంతో పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా నీళ్లు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీటితోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పాఠశాల ఎస్వో భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం విజయ, ఆశ కార్యకర్త సత్తమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మంచిర్యాలటౌన్: పారిశుద్ధ్య కార్మికులకు గత రెండు నెలలకు సంబంధించిన వేతనాలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో కమిషనర్ సంపత్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు హరికృష్ణ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో కార్మికులందరికీ రెయిన్ కోట్లు, లాంగ్ బూట్లు, బ్లౌజులు ఇప్పించాలని కోరారు. 60 మంది పారిశుద్ధ్య కార్మికులను తొలగించారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ప్రతీనెల 10లోపు వేతనాలను చెల్లించేలా చూడాలన్నారు. కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటి, పట్టణ కార్మిక సంఘం బాధ్యులు లింగయ్య, శ్రీనివాస్, లింగయ్య, సత్తయ్య పాల్గొన్నారు.